# సంపాదకీయము

మాఘ మాసం వచ్చిందంటే చాలు మనకు మన ఆది గురువు పూజ్య లాలాజీ గారు జ్ఞప్తికి వస్తారు. మహాను భావులు వారి అవసరము మానవాళికి ఎంతో వుంటేకాని ఊరకే రారు. వారు రావడము పోవడమూ కూడా చాలా సహజముగా మెరుపులా జరిగిపోతుంది. ఆ మెరుపు 133 సంవత్సరములకు ముందు వెలిగినా అలల వలె దానివెంటవచ్చే ధ్వని నానాటికీ ఎక్కువయి మానవ శ్రేయస్సును కాంక్షిస్తున్నది. అప్పుడు మెరిసి విరిసిన వెలుగు వినూత్న ఆధ్యాత్మిక శకమారంభానికి నాంది. మెరుపులోని వెలుగును పట్టి ఇతరులకు పంచడమనేది ఆషామాషీ కాదు. మన గురువు పూజ్య బాబూజీ గారు ప్రేమ, కరుణ, దయ, క్షమ వంటి దైవీకమైన గుణముల సమ్మిళతాకారము కాబట్టి వారు గురువుగారందించిన సరళీకృత రాజయోగాన్ని, శతసహస్రశిరములుగల ఫణిరాజు సమానమైన మన కోరికలకడ్డువేయ సామర్థ్యము గల ప్రాణాహుతిని మనకు ప్రసాదించి, 'A' బిందువు, 'B' బిందువుల వద్ద చేసే ధ్యాన పద్ధతిని విశదీకరించినారు. వెనుకెవ్వడో వాని గురువువద్ద కెళ్ళి ఆతనిపట్ల తనకున్న ప్రేమ గొప్పతనాన్ని ప్రస్తావించాడట. దానికి ఆ గురువు 'ఆలాగా, ఆ ప్రేమను నీ వద్దే వుంచుకో, మనిద్దరికీ కావలసిన ఆత్మసంయమము నాకుంది' అన్నాడట. మనకూ గురువు గారి ఎడల ప్రేమ, భక్తి వుందంటే మనందరము ఆకోవకు చెందిన శిష్యులమా యనిపిస్తుంది. ఒక సారి గురువింట పింగాణి కప్పులో కాఫీ తాగుతుంటే అది కాస్తా విరిగిందట. దానిలో తన తప్పేదీ లేదన్నట్లు ఈ పింగాణి కప్పులను ఇంత నాజూగ్గా ఎందుకు చేస్తారో యని వాపోయాడట. దానికతని గురువుగారు కప్పు బాగానే చేస్తారు కాని మనమే దానికనుగుణముగా నడచుకోలేదని యన్నాడట. ఎంత చిన్న కష్ఠమయినా ఓర్చుకోక భగవంతుని గాని, మన కర్మను గాని దానికి కారణంగా భావించడము సరిగాదు. పూజ్య లాలాజీ గారు జన్మతః ధనికుడే అయినా తనకు కలిగిన దారిద్ర్యమును సంయమనంపాటించి జీవించి మనమెట్లు మెలగాలో తెలియచెప్పారు. మనచుట్టూయున్న పరిస్థితిని మార్చ ప్రయత్నించడము ఆధ్యాత్మిక వివేకముకాదు. ఉన్న పరిస్థితులకనుగుణంగా మనను మనము మలచుకోవాలి. అంతమాత్రం చేత ప్రయత్నలోపముండవచ్చని కాదు కాని మనకు కర్మ ఫలాపేక్షయుండరాదు. అవసరమైతే ఎంతైనా యివ్వబడుతుంది. ఆడంబరాలకు అవకాశం కోరడం ఎదుగని మనస్సు లక్షణం. ప్రాణాహుతి ఆధారిత యోగ మార్గంలో ప్రగతి త్వరితము పరిమితము కారాదు. ప్రతి ఒక్కరూ యీ పద్ధతిని పలువురకు తెలియపరచడము తమ బాధ్యతగా గుర్తించి మనము ప్రవర్తిస్తున్నాము. ఈ స్పృహ యింకా పెరగాలి, అదే మనశ్వాసగా మనగలగడం గురుదేవుల అనుగ్రహం వల్ల సులభంగానే అలవడుతుంది. మనలోని పూజ్య

బాబూజీగారి అరుణ కిరణాలు అందరినీ ఆకర్షిస్తుంది, అలరిస్తుంది, ఆదరిస్తుంది. ఆధ్యాత్మిక పరిమళం విశ్వమంతా వెదజల్లబడుతుందనేది తథ్యం. అట్టి భవిష్యత్తు కలుగజేయటంలో మనవంతు శ్రమతో మనము పాల్గొనగలగడము మనకు లభించిన గురుకృపావిశేషం. శుభం.

(బసంత్ సంచిక 2006 : 13-1)